మీద ముందు కూర్చో పెట్టుకుని పారిపోవడాలూ, తరవాత ఒంటిగా పోయి రిహార్సల్సు చేస్తే యీ కడుపు వొచ్చిందిట.

తండ్రిని వెంట రానిచ్చేవారుకాదట. అనుమానం తగిలి తీసు కొచ్చేశాడు. అప్పటికే మూడునెలల గర్భం.

ఆలోచించి నాకు జబ్బు ఎక్కువయిందని ఆ అమ్మాయిని తీసు కొని మద్రాసు వొచ్చేశాను. ఫిల్మ్‌కి పెట్టుబడికాక నా కిదో ఖర్చు.

★

# తరుణాల చిత్రంబు....

స్టూడియో కేఫ్‌లో కూచుని వున్నారు వెంకుబాబూ, జాలయ్యా పకోడీలు నములుతో. దూరంనించి ఆర్కెస్ట్రా వినపడుతోంది. మూడు వందలో మాటు ఆ పాడు పాటని వాయిస్తో....

"వలపుల వేడుక వాడు
నా జోలికి ఇకనేమో రాడూ.
కొవ్విన కోయిలా పాడూ
చందమామా ఆఆఆ" అంటో.

"ఆ కిటికీ మూ సెయ్యరా, ఇంక వినలేను ఆ పాట" అన్నాడు జాలయ్య.

"రేడియో తిప్పవయ్యా" అన్నాడు హోటల్ ఆయన్ని దాంటోంచి.

"చంద్రబింబపు మొహము
గండుకోయిల స్వరమూ,
పండు వెన్నెలలోనా
పవ్వళించేనే."
అని వినపడ్డది.

"అ దేదో మృగంలాగుందేమిట్రా. అదేదో మొహం. స్వరం, వెన్నెట్లో పడుకుందిట" అన్నాడు వెంకుబాబు.

"బ్రదర్!" అన్నాడు జాలయ్య తలుపులోంచి కనపడే క్రోటన్ల రంగులవంక చూస్తో.

జాలయ్య 'బ్రదర్' అని పిలిచాడంటే ఏదో కొంప ముంచాడన్న మాటే.

"ఏం?" అన్నాడు వెంకుబాబు పకోడీల వంక చాలా కోపంగా చూస్తో.

"మా తండ్రికి చాలా జబ్బుగా వుందిట్రా."

"నీ కో తండ్రి కూడా వున్నాడా?"

"అదేమిట్రా?"

"సినిమా వాళ్ళకి తండ్రులు వుంటారనిపించదు. వున్నా తండ్రికి జబ్బుచేస్తే అదో పెద్ద విషయం కింద ఆలోచించరు అనుకున్నాను. నిన్నే అనటం లేదురా. మా తండ్రి బ్రతికివుంటే నేనూ అంతే."

"నిజం వుందిలే నీ మాటల్లో. తండ్రి చచ్చిపోతో వుంటే సెట్ల మీద ఎగశ్వాసలు పీల్చి పీల్చి, ఆయాసంగా గంటన్నర సేపు ఉపన్యాసా లిచ్చే ప్రధాన నటకులు జ్ఞాపకం వొస్తారు. సరేగాని నేను మా వూరు వెడుతున్నాను."

"ఏమిటి! తండ్రి జబ్బుకే."

"కాదురా. ఆస్తి చిక్కులున్నాయి. సినిమాల్లో చేరానని ఆస్తి మా అక్కకి రాస్తా నంటున్నాట్ట."

"అట్లా చెప్పు. ఆస్తిని రాయించుకుని, అమ్మి, డబ్బు తీసుకొచ్చి, ఓ డైరెక్టరో, ప్రొడ్యూసరో కావాలని. ఔనా?"

"అదంతా ఎందుకు ఇప్పుడు?"

"మీ తండ్రి నీకన్న చాలా బుద్ధిమంతుడులా గున్నాడు వెళ్ళకు. మీ అక్కకే రాయనీ ఆస్తినంతా. సినీమా నిన్ను తన్నేసిన రోజున తిండికి అక్క పంచకి చేరవొచ్చు" అన్నాడు వెంకుబాబు.

"బ్రదర్, నా కో సహాయం చెయ్యాలి. నేను వొచ్చిందాకా కొంచెం రుక్మిణిని కనిపెట్టి చూస్తోవుండు."

"ఏమిటి? డిటెక్టివ్ పనా?"

"అది కాదురా. ఆ అమ్మాయి పుత్త అర్భకురాలు."

"అర్భకురాలా? ఆ హోటలు కాతా తెరిచిచూడు, రుక్మిణి పద్దు."

"అదికాదురా! మనసు. చాలా చాతకానిది. భయస్తురాలు."

"ఏమిటి? కానీ లేకండా ఇంటోంచి అర్ధరాత్రి పారిపోయి పదిహేను మైళ్ళు రైలు దగ్గిరికి నడిచివొచ్చి మద్రాసు చేరుకున్న పిల్ల భయస్తురాలా?"

"ఆ భయం కాదురా, మొగాళ్ళని చూస్తే. అందులో భాస్కరావుని చూస్తే అట్లా వొణుకుతుంది ఎందుకో! నువ్వూ చూసేవుంటావు."

"భాస్కరావు ఆమె నేమీ వొణికించడే!"

"అదే నేనూ యోచిస్తా. ఏంలేదంటుంది."

"ఏమన్నా వున్న దేమిట్రా మీ ఇద్దరికీ? ఒరే, సినిమాల్లో చేరడమే రొంపిలో దిగడం. పైగా ఓ సినీమా అమ్మాయి వలలో పడ్డవాణ్ణి ఆ గజరాజవరదుడు కూడా రక్షించ లేడనుకో."

రేడియో "గాలిలో నా బతుకు తేలిపోతో" అంటోంది.

"ఎవర్రా అట్లా బెదిరిస్తాడు? గాలిలో తేలిపోతున్నాను జాగ్రత్త అని?" "ఎప్పుడో గాలిలోంచి మన నెత్తిమీద పడతానని గావును?"

"మొన్న మావూరు వెళ్ళినప్పుడు........" అన్నాడు వెంకుబాబు.

"నీ కో వూరు కూడా వుందా ఏమిటి!"

"అదేమిటి?"

"నాకు తండ్రి లేడన్నావుగా? పోనీలే, పోనీ ఆ వూరు పేరేదో చెప్పు చూద్దాం."

"నూజివీడు,"

"నూజివీడా?"

"ఏం?"

"అదీ వొక వూరేనా ఏమిటి?"

"వినరా, చీకటి పడేప్పుడు హటాత్తుగా సినిమాహాల్లో 'లెండో, రండో' అని కేక లేశిందిరా, పెద్ద గొంతుతో ఒకామె తూముల మీద కూచున్నవాళ్ళని పావలాలు పట్టుకుని లోపలికి రమ్మని కేకలేస్తోందను కున్నాను. పైగా అక్కడో ఆవిడ డాబుగా నుంచుని వుంది కూడాను. తీరా చూస్తే, తరవాత "భారత భాగ్యవిధాతల్లారా?" అంది ఆ రికార్డు. ఆమె పక్కన నుంచున్న ఎత్తుపళ్ళ పక్షీంద్రుడు నవ్వుతున్నాడు. ఆ భారత భాగ్యవిధాత టాగూరు పాటలో దేవుడు. తరవాత గాంధీ, తరవాత సినిమాలముందు తూములమీద కూచునేవాడు. భారత భాగ్యవిధాత చెయ్యవలసిన పని సినిమాకి పావలాలు చెల్లించుకోడం."

"లేకపోతే ప్రభుత్వానికి, పన్నులకిందో, చందాలకిందో పావలాలు చెల్లించుకోడం."

"సరేకాని బ్రదర్, నేను వొచ్చిందాకా రుక్మిణిని చూస్తో వుండు."

"ఏం చూస్తోవుండను?"

"అదే. ఏ యిబ్బందిలోను పడకండా, కొంచెం గార్డియన్ లాగు" అన్నాడు జాలయ్య.

"పోరా, నన్నీ గొడవల్లో దింపకు. అయినా నీకు దాంతో ఏం పని?"

"వొట్టురా. నా చెల్లెలు. సోదరి, సహోదరి, మంసోదరి. చాలా?"

"రావణుల నించి కాపాడాలా నేను? నేనేం అంగదుణ్ణి కాదు"

"అంగదు డేమిటి?"

"ఎవరో వొకరు, వాలి అనుకో?"

"ఒరే చిన్నప్పుడు నీ బదులు బళ్లో నేను దెబ్బలు తినలేదా?"

"నా కోసమా? నీ మొహం! అదెప్పుడు?"

"ఇంకోడి కోసమేమోలే. ఆ సూరిగాడి కోసం గావును వాడు నీ బావేగా! ఇంతేరా స్నేహం? ఐనా ఏమిటి నీ అభ్యంతరం?"

"ఏం లేదురా. చిన్నప్పుడు మా అక్కకి వాగ్దానం చేశాను. ఏ అమ్మాయికీ గార్డియన్ పని చెయ్యనని."

"నీకు అక్క ఎక్కడ వుంది?"

"వుంటే చేసేవాణ్ణే. అదీ సంగతి."

"అంతేనంటావా? మీ అక్కతో చెప్పనులే."

"నాకు అక్క లేదన్నావుగా?"

"వొకవేళ వుంటే!"

"సరేలే, ఏం కాపాడాలి నేను ఆ అమ్మాయిని?"

"ముఖ్యం, ఆ భాస్కర్రావు రుక్మిణిని ఏం చెయ్యకండా."

"ఆ అమ్మాయిని ఎరగనే."

"నేను పరిచయం చేస్తానుగా."

# 2

ఆనాటినుంచి వెంకుబాబు రుక్మిణిని కనిపెట్టి వున్నాడు. రోజుకి రెండు మూడుసార్లు ఎట్లా వున్నారని పలకరిస్తాడు. క్లారనెట్ వాయించే భాస్కర్రావుని చూస్తే ఆమెకి భయంలాగే వుంది నిజంగా. ఎందుకో?

"ఏమిటి అంటున్నాడు భాస్కర్రావు మీతో?" అంది.

ఏం లేదు. ఆ పాటవరసలేదూ....రాజా, మహరాజా, కాంభోజా.... ప్రేమమధువుల కూజా.

ఆ వరస తన క్లారనెట్‌కి ఎదురు తిరుగుతోందిట.

"అంతేకాదు—తరవాత మన కలయిక ఎంతో మ ఆఆజా."

అని నవ్వింది రుక్మిణి.

ఆమె చూస్తోవుండగా భాస్కర్రావు ఎవరితోనన్నా మాటాడితే సరి. ఏమంటున్నాడు అని అడుగుతుంది భయంతో.

మర్నాడు రాత్రి 'నాతో చెప్పరుకాదూ? ఏదో నా సంగతే మాట్లాడుతున్నాడు. నాతో చెప్పరా? ఏం చేస్తాట. మీరుకూడా అతనితో చేరారా?" అని కన్నీళ్ళపర్యంతం అయింది.

"ఎందుకు? ఏం చేస్తాడు నిన్ను!"

"అమ్మో. మీకు తెలీదండోయ్ ఆయన సంగతి!" అంది.

కాసేపైనాక భాస్కర్రావుతో అన్నాడు వెంకుబాబు.

"ఆ రుక్మిణికి ఏమన్నా పాట వొస్తుందంటారా?"

"దానికీ, నాకూ పాటే?"

"మిమ్మల్ని చూస్తే అట్లా భయపడుతుందేం? ఏమన్నా అన్నారా ఏమిటి?"

"దాన్ని నే నే మంటాను, తప్పుడుముండ" అన్నాడు.

రుక్మిణి భాస్కర్రావుని చూసి భయపడడానికి కారణమూ కన పడదు. భాస్కర్రావు ఆమెని తిట్టడానికి కారణం కనపడదు. రుక్మిణి

చాలా సాధువైన పిల్ల. ఎవరిజోలీ అక్కర్లేదు. మొగవాళ్ళ ఇన్‌టరెస్టు అసలు లేదు....ఎట్లాగన్నా తంటాలుపడి ఆ సినిమా ఉద్యోగం నిలుపుకోవాలని ప్రయత్నం తప్ప.

మర్నాడురాత్రి రికార్డింగ్ రుక్మిణివల్ల ఆగిపోయింది. ఎన్నిసార్లు పాడినా పాటమధ్యలో వొణుకుతుంది.

బాబో. బాబో. నా కదృష్టం లేదో.

నా జీవిత మెంతో చేదో,

పెట్టండో, పెట్టండో,

పట్టెడు బిచ్చం పెట్టండో,

గంజైనా కొంచెం పొయ్యండో,

బాబో, కుయ్యో, మొర్రో!

అంటుంది. సగంలో ఆగుతుంది ఆర్కెస్ట్రాలో భాస్కర్రావుని చూస్తో.

చివరికి వెంకుబాబు జోక్యం కలగచేసుకుని, భాస్కర్రావు ఆమె వీపు తిప్పించి, తాను పక్కన కూచుని పాడించాల్సి వచ్చింది.

స్టూడియోనించి రాత్రి రెండింటికి బైటికి వొచ్చేప్పుడు వెంకుబాబు వెనకనే వొచ్చింది రుక్మిణి.

"వెంకుబాబుగారూ!"

"ఏమిటి?"

రోడ్డుకి రెండోపక్కన చెట్లనీడలో ఆగారు.

"భయంగా వుంది?"

"ఏం భయం?"

"ఏమో! నిద్రరాదు; నేను లాడ్జికి పోను."

"పోక?"

"తెల్లారిందాకా నాతో వుండండి."

"ఎక్కడ?"

"ఎక్కడైనా సరే."

బాగా పట్టుకుందే గ్రహం? కాని మిత్రుడికి వాగ్దానం. ఏమన్నా పిచ్చేమో ఈ పిల్లకి?

"పోదాం రా. నడవగలవా?"

"ఆ."

"మూడు మైళ్ళు నడిచారు నిర్మానుష్యమైన బీచికి. సముద్రం వొడ్డున ఇసికలో కూచున్నారు.

"నేనింక ఈ సినిమా ఉద్యోగం చెయ్యలేనండీ."

"పోనీ, మీ వూరు పో."

"పోయి ఏం చెయ్యను?"

తానేం చెపుతాడు!

"నువ్వు వెళ్ళడ మెందుకు? ఇంక నాలుగుసార్లు చూసి వాళ్ళే పంపించేస్తారు డైరెక్టరు చాలా విసుక్కున్నాడు, ఆ పిల్లని ఎవరు చేర్పించారని ఈ రాత్రి."

"పాపం, జాలయ్యగారు వాళ్ళని బతిమాలి చేర్పించారు నన్ను."

"మరి నీ కా భయం యేమిటి మరీని! బుద్ధిలేదూ?"

"ఆ పాటలో నన్ను బాబో, బాబో అని అరవమంటే మా ఆయన చావు జ్ఞాపకం వొచ్చింది."

"బాబో, బాబో అని నువ్వు అరిచావా, మీ ఆయిన అరిచాడా?"

"ఎదరింటి ఆవిడ అరిచింది."

"ఎందుకు?"

"మా ఆయన్ని కింద పెట్టారని."

"అరిస్తే?"

"ఆ అరుపు విని ఆయన కాస్తా చప్పున వచ్చి వూరుకున్నారు."

"అట్లా జ్ఞాపకాలు వొస్తే సినీమాలో ఏంపని చెయ్యగలవు?"

"తీసేస్తారంటారా?" అని పెద్దపెట్టున ఏడవడం మొదలుపెట్టింది.

"ఏడవకు, జాలయ్యమాటని తీసెయ్యలేరులే వాళ్ళు."

"జాలయ్యగారికైనా విసుకుపుట్టదా ఇట్లాంటి నిర్భాగ్యురాలిమీద!" అని ఏడుస్తోంది.

ఆ ఏడుపు విని ఎవరన్నా పోగవుతారని భయం వెంకుబాబుకి.

ఆమెని దగ్గిరకు తీసుకుని కన్నీళ్ళు తుడిచి ఫరవాలేదని ధైర్యం చెప్పాడు. అతన్ని ఆనుకునే కూచుంది ఏడుపు మాని నల్లని సముద్రం వంక చూస్తో. శని, అంగారకులు ఎర్రగా కనిపెడుతున్నారు వాళ్ళని.

"నీకెందు కా భయం భాస్కర్రావుని చూస్తే?"

"నాకేం భయంలేదే! నా కెందుకు భయం? ఎందుకనుకున్నారు అట్లా?"

"ఏమో! అనుకున్నాను. అతన్నెరుగుదువా?"

"ఎబ్బే స్టూడియోలో చూడడమే."

ఆరాత్రి సీను తలుచుకుంటే వెంకుబాబుకి అనుమానంగా వుంది. రుక్మిణి పాట సరిగా సాగకండా ఏ విధంగానో తెలిసో తెలీకో భాస్కరరావు అడ్డం తగులుతున్నాడనీ, రుక్మిణి సరిగా పాడడం అతనికి ఇష్టం లేదనీ, అతని అయిష్టమే రుక్మిణిని అట్లా తబ్బిబ్బు చేసిందనీ.

"పోనీ, నన్నింకో స్టూడియోలో చేర్చలేరా మీరు?"

"నా కెవరు తెలుసు? జాలయ్యని అడిగిచూడు."

"నే నిక్కడ ఇంక పనిచెయ్యలేనండి."

"ఎందుకు?"

"ఏమో!"

అందుకనే స్త్రీ చిత్తాన్ని అట్లా తిట్టిపోశారు అనాదినించి. కాని పురుషుడికి అర్థంకాని. అతనికి అర్థమయ్యే కారణాలకన్న బలమైన అర్థం గల కారణాలు స్త్రీకే తెలీకండా ఆమెలో పనిచేస్తాయని ఎవరికి తెలుసు? అన్నాయి దొర్లిపడే అలలు.

శుభ్రంగా ఎదిగే చెట్టు ఒక్క రోజులో ఎందుకు ఎండిపోతుందో.... ఓ సాయింత్రం ఆవు పాలు ఎందుకివ్వదో....హాయిగా కూచున్న రంగుల పక్షి ఎందుకు దూరంగా ఎగిరిపోయి జాలిపుట్టేట్టు కీచు కీచుమంటుందో ఎవరికి తెలుసు?

చప్పున "దిక్కులేనిదాన్ని, వొంటరిదాన్ని, నా వొక్క కడుపు కోసం అడ్డమైన వాళ్ళచేతా చివాట్లు తింటో" అంటో ఏడ్చింది అతన్ని ఆనుకుని. ఏ మగావాడైనా ఏమంటాడు."

"నేనున్నానుగా" అననివాడు మొగవాడేకాదు. అతను మానవుడవ డానికి వీల్లేదు. మర్నాడు పొద్దున్న ఆ మాట మరిచిపోనీగాక దాంటో అబద్ధం లేదని నక్షత్రాలు సాక్ష్యం చెపుతాయి.

ఏమిటి వీళ్ళిద్దరూ ఇక్కడ అని ప్రశ్నించుకుంటున్నారు నక్షత్రాల మధ్య ఎగిరే వాళ్ళ జాతకవిధాతలు. పురుషుడు వూరికే తాను వున్నా నంటే నమ్ముతుందా స్త్రీ. వొంటరిగా అర్థరాత్రి సముద్రం ముందు? వుత్త మాట అనుకునితీరుతుంది.

"నిజమా? నిజమా?" అని అతని భుజంమీద తల పెట్టి అతనిచేతిని పట్టుకుంది.

రెండో చేత్తో ఆమె ముఖాన్ని దగ్గిరికి తీసుకుని ముద్దు పెట్టు కున్నాడు. కన్నీళ్ళతో చంపలికి అతుక్కున్న జుట్టుమీద ఆమె పెదిమల్ని అతని నోటివేపు అందిచ్చింది.

"రుక్మిణీ! రుక్మిణీ!"

వాళ్ళిద్దరికీ ప్రేమ? అది నీతి? మరి తెల్లారితే? తరవాత? తనకు అన్యాయం చేస్తున్నాడా ఆమె అసహాయత్వాన్ని పురస్కరించుకుని? చలం ఆగ్రహిస్తాడా?

ఆ ప్రశ్నలు చదివే మీకు కాని, ఆ రాత్రి సముద్రం అలల పంచన, ఆకాశం కింద, ఇసికలో కూచున్న వాళ్ళిద్దరికీ యే సందేహాలూ లేవు. ఆ రాత్రి గడియలు వాళ్ళవి. అందుకునే ఎంత నలపనీ. చీల్చనీ, ఆపదలమీద ఆపదల్ని దొర్లిందనీ, ఉండుండి అట్లాంటి దివ్యానుభవాల్ని ఎప్పుడో ఒకప్పుడు ప్రసాదిస్తుంది గనుకనే. ఆ ఆశే ఆ కలలే, ఆ విశ్వాసమే జీవితాన్ని దుర్భరం కానీకండా నిలుపుతోంది.

పెదిమలమీది వొత్తిడి అతని చేతివేళ్ళని తొందరపెట్టింది. మిస్టరీ లోకల్లా మిస్టరీ ఎన్నిసార్లు చూసినా, తాకినా, అనుభవించినా, మనసునించి చెదరని మిస్టరీ స్త్రీయవ్వనం. మెల్లిగా అతని వేళ్లు ఆమె మెడనించి నడుముకి నడుము సన్నదనం నించి జారిపోతున్న ఆమె పమిటకిందికి పాకాయి. పురుషుడి అరిచేతికీ స్త్రీ రొమ్ముకీ మధ్య యే గొప్ప సృష్టి రహస్యాల్ని, నిగ్గుతీసిన అగ్ని సౌఖ్యాల్ని అనాదినించి పర్వతాల మీద వారిగే ఆకాశ సౌందర్యాన్ని కేంద్రీకరించిందో సృష్టి!

ఒకవేపు నించి నవ్వుతో నీటి అక్షతలు చల్లి ఆశీర్వదిస్తోసముద్రం: ఏం జరుగుతోందని తొంగి చూద్దామని ప్రయత్నించే మెరీనా దీపాలు— మనుష్య నిర్మితాలు. ఆమె నిస్సహాయంగా అతన్ని అల్లుకుపోయింది.

## 3

మర్నాడు జాలయ్య దగ్గిర్నించి ఉత్తరం - అతని తండ్రి చచ్చిపోయినాట్ట. అది ఒక్క వాక్యం. తక్కిన నాలుగు వాక్యాలు రుక్మిణి ఎట్లా వుందనీ, రుక్మిణిని చాలా జాగ్రత్తగా చూడమనీ. ఆ ఉత్తరం రుక్మిణికి చూపించాడు.

"పాపం ఆయనకి నన్ను చూస్తే చాలా ప్రేమ" అంది.

"ఏం ప్రేమ?" అన్నాడు కోపంగా వెంకుబాబు.

అప్పుడే ఆమె దేహం, హృదయం, ఆత్మ నాలుగు జన్మల వరకు తనదై పోయింది.

"ఎబ్బే! ఆయన నా సోదరుడు. నా తండ్రి" అంది.

"ఎందువల్ల?" అన్నాడు అసందర్భంగా.

"ఆయన చెపితేనే."

"నేనూ?"

"మీరా! నా ప్రాణం."

"ఎందువల్ల?"

"రాత్రి మీ రసలేదా?" అంది సిగ్గుతో.

జాలయ్యకి జవాబు రాశేశాడు వెంటనే అక్కడే.

"రుక్మిణికి వొచ్చిన భయం ఏమీ లేదు. చాలా జాగ్రత్తగా, దగ్గిరిగా, ప్రేమగా చూసుకుంటున్నాను. చాలా సంతోషంగా వుంది" అని.

"మీరట్లా రాయకండీ" అంది రుక్మిణి.

"యేం?"

"ఆయన యేమన్నా అనుకుంటారు."

"యేం అనుకుంటాడు?"

"నే నేదో చేస్తున్నాననుకుంటారు."

"చెయ్యటంలేదా మరి!"

రుక్మిణికి కోపం వొచ్చింది. చేసినపనే మాటలతో వినడం కష్టం స్త్రీలకి. మాటలతో అనుకునేదే అచ్చులో చదవడం ఆగ్రహం సరస్వతీ స్వాములకి.

ఆమె మాట్టాడలేదు.

"ఐనా అతనికి తెలిస్తేనేం?"

"తన సోదరి ఇట్లాంటి పని చేస్తోందంటే కష్టపడతారు. చెయ్యగానే, చేసింది సిగ్గుపడి దాచుకోవాలని స్త్రీ స్వభావం. చెయ్యగానే చేసింది గర్వంగా చాటుకోవాలని పురుష స్వభావం.

ఏనాటికైనా ఎదన్నా అర్థమవుతుందిగాని మనుషులకి, పురుషుడు స్త్రీకి అర్థం కాడు. అంతకన్న స్త్రీ పురుషుడికి అసలే అర్థంకాదు. అందు వల్లనే వాళ్ళకి భూమికీ ఆకాశానికీ మధ్య వుండే ఆకర్షణకన్న బలమైన లాగుడు, దగ్గిరగా అర్థం చేసుకోవాలనే నిరంతర ప్రయత్నం. లేనిది ఉన్నదనుకోడం, ఉన్నది లేదనుకోడం. లేనిదాన్ని కలలతో నిర్మించుకుని ఉందని మోసపోవడం, ఉన్నదాన్ని లేదని కన్నీళ్ళతో సమర్థించుకోడం. జీవితం నెత్తిమీద కొట్టి కళ్ల విప్పినకొద్దీ ఆగ్రహాలు, నిందలు, వైరాలు, ఎడబాట్లు, ఏడుపులు, హత్యలు, ఆత్మహత్యలు. పోనీ ఈ ఇంద్రధనస్సుల రంగుమాయలు లేకుండా సత్యం చూడగల మేధావి వుత్తసినిక్కు. ఏ ఆకర్షణా, అనుభవమూ, అమృతమూలేని నిర్భాగ్యుడు, నిస్సారమైన కొయ్య. స్త్రీ విలువల్నించి తప్పించుకుని జీవించడం, రసంపిండిన చెరుకుపిప్పిని నమలడం-కాని ఆ చెరుకు పెదిమల్ని కోస్తుంది.

"చూడండి. మనిద్దరం మాట్టాడుతోవుంటే ఎట్లా చూస్తున్నాడో?"

"ఎవరు?"

"ఎవరున్నారు? భాస్కరరావు" విస్సుర్లో అంది.

భాస్కరరావేమీ ప్రత్యేకం చూట్టం లేదనిపించింది వెంకుబాబుకు.

ప్రతిరోజూ ఎక్కడో ఓ చోట కలుసుకుంటున్నారు రాత్రి పూటల వాళ్ళు. తాను అతని ప్రాణం ఐపోయినాను కదా. ఇంక ప్రతి పూటా కలుసుకోవలసిన పనేముంది అనుకున్నట్టుగా వుంది ఆమె. ఆమె తన

ప్రాణమైపోయింది కదా. రోజుకి ఓసారైనా తన ప్రాణాన్ని నగ్నంగా చూసుకోకపోతే, ఇంక తన ప్రాణమన్నది ఏముంది? అనుకుంటున్నాడు అతను. మళ్ళీ స్త్రీ పురుష స్వభావభేదం.

'ఈ సంగతేం భాస్కరరావుగారితో చెప్పకండేం?" అంది ఓసారి చెట్టుకింద అతని చేతుల్లో పడుకుని, కొమ్మల్లోంచి నక్షత్రాలవంక చూస్తో.

ఆ రాత్రి ఓ కంతలోంచి పార్కులోకి దూరారు వాళ్ళు. ఆ తోవ ఆమెకెట్లా తెలుసా అనుకున్నాడు వెంకుబాబు. మొదట ఆమె సాహసాన్ని మెచ్చుకున్నవాడు కాస్తా.

"ఎందుకు చెపుతాను? కాని అతనికి తెలిస్తే నీకేం భయం?"

"అమ్మా! పూరుకోరంబోయి? ఆయనగారి సంగతి మీకు తెలీదు."

"తెలీదమెందుకు? అతని కెందుకు మధ్య! పూరుకోక వురి వేసుకోమను."

"ఐతే చెపుతారా? చెపితే నే నింక మీతో ఇట్లా రాను."

"రాకపోతే వూరుకుంటానా?"

అని వూరుకోక ఏం చేస్తాడో తెలియచేశాడు. కాని ఆ సమయంలో మొగవాణ్ణి వొప్పించే విధం స్త్రీకి బాగా తెలుసు.

అయిదోరోజు సాయింత్రానికి జాలయ్య వొచ్చాడు. ఆవేళకి రుక్మిణి సెట్టుమీద తంటాలుపడుతోంది.

"అదేమిటి? అప్పుడే ఎట్లా వొచ్చావు?" అన్నాడు వెంకుబాబు.

"ఏం? వొస్తేనేం? నేను రావడం నీకు బావుండలేదా?"

"బావుండకేం? అది కాదు, మీ తండ్రి పోయాడని రాశావుగా."

"మా తండ్రితోబాటు నేనూ పోయాననుకున్నావా?"

"అదికాదోయ్! కర్మా అదీ తగలెయ్యాలిగా."

"ఇక్కడ కొంత కర్మ మిగిలిపోయింది. ఏదీ రుక్మిణి?" అంటో వెళ్ళాడు సెట్టువేపు.

ఏమిటి అట్లా మండిపడుతున్నాడు?

ఆ రాత్రికి పూర్తోలేని ఓ మిత్రుడి గది సంపాయించుకు వుంచు కున్నారు రుక్మిణీ, వెంకుబాబూ.

తమ ప్రేమకి విఘాతం రాదుకద ఈ జాలయ్య !

ఆ రాత్రికి స్టూడియోలో కనపళ్లేదు జాలయ్య. కొత్త సీను సెట్ మీద రిహార్సలు అయింతరవాత రుక్మిణి వెళ్ళిపోతోంది. పక్కన నుంచున్న వెంకుబాబువంక చూడలేదు. అతనికోసం వెతకలేదు. ఆమె పక్కకి వెళ్లి నడుస్తున్నాడు అతను. వెళ్ళే మనుషుల్లో అతన్ని చూసి ఆమె మొహం వెలవెలపోయింది. రోడ్డుమీద తక్కినవాళ్ళనించి చీలిపోయి నారు వాళ్ళిద్దరూ.

"నడుద్దామా?" అన్నాడు వెంకుబాబు.

"ఇవాళ రాత్రికి...."

ఎదురుగా జాలయ్య వొచ్చాడు.

వెంకుబాబు అక్కడ లేనట్టే చూస్తో "రా రుక్మిణీ" అన్నాడు.

రుక్మిణి తల వొంచుకుని నిలబడిపోయింది. స్నేహితులిద్దరూ అట్లానే నిలబడిపోయినారు.

"రా రుక్మిణీ"! అని వెంకుబాబు.

"రా రుక్మిణీ" అని జాలయ్య.

ఏం మాట్లాడదు. కదలదు రుక్మిణి.

"ఎక్కడికి రమ్మంటావు రుక్మిణిని?" అన్నాడు జాలయ్య.

"నువ్వు ఎక్కడికి రమ్మంటావు?"

"లాడ్జిలో దింపడానికి"

"చెప్పు రుక్మిణీ"

ఏమీ చెప్పదు రుక్మిణి.

"జాలయ్యా! నేనూ రుక్మిణీ ప్రియులం. చాలా ప్రేమ మాకు."

"ప్రేమా? ప్రేమేమిటి? ఏమిటది రుక్మిణి?"

రుక్మిణి మాట్లాడదు.

"పిల్లేదు" అని జాలయ్య.

"పిల్లేదేమిటి? నువ్వెవరు పిల్లేదనడానికి?"

"నేను రుక్మిణి గార్డియన్."

"రుక్మిణి అట్లాంటిపనులు చెయ్యడానికి పిల్లేదు, నేను మంచి సంబంధం కుదురుస్తున్నాను."

"కుదర్చమందా నిన్ను"

"కుదర్చమనడ మేమిటి? గార్డియను ఇష్టం."

"ఏం రుక్మిణీ! అతని ఇష్టమేనా?"

రుక్మిణి మాట్లాడదు.

"అయినా నీకు పెళ్ళి అయింది." అన్నాడు జాలయ్య వెంకు బాబుతో.

"ఐతే?"

"ఐతే లేదు గియితే లేదు పో."

"నీకు పెళ్ళి కాలేదా?"

"అయింది. అందుకునే నేను గార్డియన్."

"నాకూ పెళ్ళయింది. నేనూ గార్డియన్నే."

"నీ పెళ్ళాం ఈ వూళ్ళో లేదుగా. నువ్వెట్లా గార్డియన్ అవుతావు?"

"పిలిపిస్తాను."

"పిలిపించడానికి నీకు డబ్బెక్కడిది?"

"అప్పు చేస్తాను"

"అప్పెవరిస్తారు నీ మొహానికి?"

"నువ్వే"

ఇట్లా సంభాషణ తెల్లవార్లూ నడిచేదో ఏమో! రుక్మిణి జాలయ్య చెయ్యి పట్టుకుని, వెంకుబాబువీపు వేపుతిప్పి, మాట, చూపు ఏమీ లేకండా వెళ్ళిపోయింది.

ఆ రాత్రి వెంకుబాబుకి నిద్రలేదు. జాలయ్యని ఎన్నివిధాల చిత్రవధ చెయ్యడానికి వీలుందా అని ఆలోచన.

మర్నాడు స్టూడియోలో రుక్మిణి అతనితో మాట్లాడలేదు. అతని వంక చూడలేదు. కొత్త పూదానిల్కుచీరె కట్టుకుని వొచ్చింది. ఆమే, జాలయ్యా టాక్సీలో వెళ్లిపోయినారు.

జాలయ్యా వెంకుబాబుతో మాట్లాడలేదు, అంత స్నేహితుడూను.

ఆ మర్నాడు జాలయ్యని వెంకుబాబే ప్రశ్నించాడు.

"ఎప్పుడు వెడతావు మీ వూరు?"

"ఎందుకు వెడతాను?"

"మీ తండ్రి పోయినాడుగా."

"పోతే?"

"కర్మ అవీ చెయ్యవా?"

"మా అక్కయ్య చేస్తోంది."

"అదేమిటి? నువ్వుండగా మీ అక్కయ్య కర్మ చూడడమేమిటి?"

"ఆస్తిలో సగం దానికి రాశాడు."

"పోనీ సగం నీకూ రాశాడుగా! నువ్వు కొడుకువి కావా? హిందువుడివి కావా? నిన్ను కని పెంచిన తండ్రిమీద ఏమీ కృతజ్ఞత లేదా?"

"వెడదామనుకున్నాను. కాని రుక్మిణి రానంటోంది."

"కర్మ చెయ్యడానికి రుక్మిణి ఎందుకు?"

"మరి నేను గార్డియన్ని. చచ్చినవాళ్ళమీదకన్న బతికి వున్న వాళ్ళమీద ఎక్కువ శ్రద్ధ చూపాలన్నారు, చలం, శ్రీశ్రీ మొదలైన మహాకవులు."

"సరేలే, ఇంతలో రుక్మిణి ఏమవుతుంది? వెళ్ళిరా. తండ్రికర్మ చెయ్యకపోవడం చాలా ఘోరపాపం."

"నువ్వా రా. చచ్చిపోయేప్పుడు వెంకుబాబు అంటో చచ్చిపోయి నాట్ట ఆయన. ఎందుకోమరి! నువ్వు వొస్తే నేను బైలు దేరతాను."

"బావుంది! నేనేమిటి?"

"మరి నాచేత కర్మ చేయించి, ధర్మం నిలబెట్టించు."

"సరేగాని, రుక్మిణిని నాతో మాట్లాడకండా చేశావేం?"

"కాకపోతే అర్థమైనవాళ్ళతోటి మాట్లాడనిస్తారా?"

"నేను అర్థమైన వాణ్ణా? ఎందుచేత?"

"ఏ మెరగని పసిపిల్లని మాయమాటలు చెప్పి, మోసగించి ఇంకా అడుగుతున్నావా? నేనుగనక వూరుకున్నానుగాని...."

"నీకేం సంబంధం?"

"నేను గార్డియన్ని. ఇంక నోరుమూసుకు పద."

నోరు మూసుకుని వెళ్ళిపోయినాడు వెంకుబాబు. కానేపటికి అతని కో ఉత్తరం వచ్చింది.

"నిర్భాగ్యురాల్ని. నామీద ఆగ్రహించకండి!" రుక్మిణి.

## 4

కాఫీ తాగి పేపరు చదువుతున్నాడు వెంకుబాబు తనగదిలో. అతని పని చాలా నిస్సహాయంగా అయిపోయింది. ఇప్పట్లో రుక్మిణితో ఒక్క మాట మాట్లాడే విధంకూడా కనిపించటంలేదు.

గబగబ పరిగెత్తుకు వొచ్చాడు జాలయ్య.

"రుక్మిణి ఏదీ?"

"రుక్మిణి? ఏం రుక్మిణీ?"

"రుక్మిణిని చూపిస్తావా బుర్ర బద్దలుకొట్టనా?"

"నా బుర్ర బద్దలుకొడుదుగానిలే. ముందు రుక్మిణి ఏమయింది? అది చెప్పు."

"అదే నిన్ను అడుగుతున్నాను. రెండు గంటలసేపటినించి—"

"ఎందుకు అడుగుతున్నావు? కనపట్టంలేదా రుక్మిణి?"

"కనపడకనే"

"ఎప్పణ్ణించి?"

"తెల్లారే లేచి చూసేసరికి లేదు."

"ఎక్కడ"

"ఎక్కడేమిటి? మా ఇంట్లోనే."

"మీఇంట్లో ఎందుకుంది రుక్మిణి?"

నాలిక కొరుక్కున్నాడు జాలయ్య.

"గార్డియన్ ఇంటో వుండదా?"

"మరి నీ భార్య నడిగావా?"

"నా భార్య ఎక్కడ వుంది? అప్పుడే పంపించేశాను."

"వొంటరిగా వున్నావా రుక్మిణితో?"

"ఒరే వెంకుబాబూ, చాలా రోతమనసురా నీది! నా సోదరి అని చెప్పలేదురా నేను?"

"సోదరితో ఓ పక్కమీదనే పడుకున్నావా?"

"అయితేనేంరా? సోదరి ఐనాక!"

"అందుకనే గావును పారిపోయింది. తెల్లారి లేచి, మళ్ళీ ఇంకోసారి పొద్దున్నే నీ మొహాన్ని చూడలేక."

"నీకు నిజంగా తెలీదా?"

"తెలీదు"

"ఐతే వెతుకుదాం పద."

"నాకేం? నాకెవరు రుక్మిణి?"

"అదేమిట్రా అట్లా అంటావు? అంత ప్రేమించి, నమ్మించి పాపం ఆ పిల్లని. ఇంత ఘాతకుడివి అనుకోలేదు."

"సరే పద"

"యేమయిందంటావు?"

"గార్డియన్వి కదరా! బాగా చలాయించావు గార్డియన్ గిరీ. ఊపిరాడక పారిపోయింది గావును"

"నువ్వు దాచలేదా?"

"దాచగల సామర్థ్యం వుంటే ఎన్నడో నీ గార్డియను గిరీ నించి తప్పిద్దును"

"ఐతే పద వెతుకుదాం"

"ఎక్కడ?"

"పదకొండింటికే రమ్మన్నారు స్టూడియోకి. ముందు అక్కడికి చావాలి."

"అవును అక్కడికి పోదాం, వొస్తుందేమో!"

గేటులోకి వెళ్ళేప్పటికే ఎదురు వొస్తోంది రుక్మిణి భాస్కరరావు వెంట. ఆమె వాళ్ళిద్దరిలో ఒక్కరి వంకా చూడలేదు. వాళ్ళిద్దరూ లోపలికి వెళ్ళిపోయిం తరవాత వెంకుబాబు.

"యేమిట్రా గార్డియన్! యేమంటావు?" అన్నాడు.

జాలయ్య నురగలు కక్కుతున్నాడు.

"పద ఇంకనన్నా పోయి తండ్రి కర్మని యేడు."

"భాస్కరరావు కర్మ చేస్తాను."

"అదీ అట్లా వుండాలి పౌరుషం. అదేమిట్రా అతన్ని చూస్తే అంత భయం నటించేది?"

"నటనకాదు. రుక్మిణి ఎన్నడూ నటించదు. నటించడం చాతనైతే సినీమాలో తార అయ్యేది."

"ఇంకా నమ్మకమే యీ చచ్చు పీనిగకి."

"నిజంగా భయమే. నా మాట నమ్ము. వాడికేదో హోల్డు వుంది రుక్మిణిమీద. ఏదో బెదిరించి లాగాడు మననించి."

"నీ నించి."

"సరేలే"

"అతనికి ఆరుగురు పిల్లలు. పెద్దకూతురుకి రుక్మిణి ఈడు. ఒకవేళ అతన్ని గార్డియన్ చేసుకుందేమో!"

"ఏం? నే నెందుకు పనికిరాను?"

"మరి భార్యని కూడా పంపించేసి పక్కన పడుకోపెట్టుకుంటే

అట్టే గార్డియన్‌లాగు కనిపించలేదేమో నువ్వు. పిల్లలున్న వాడైతే మరీ మర్యాదగా వుంటుందని వెళ్ళివుంటుంది."

"నాన్‌సెన్సు, వూరుకోను."

"ఏం?"

"ఏమిటి? రుక్మిణీ బాధ్యత నాది. అట్లా అవినీతిపనులు చెయ్యనీను. అదేమిట్రా వెంకుపంతులూ! నువ్వూ అట్లా నవ్వుతావేమిటి. ఆ పిల్ల అట్లా అధోగతికి పోతోవుంటే!"

"అవును. వొప్పుకోకూడదు. పద."

"ఏం చేద్దాం?"

"తన్నరా"

"నువ్వూ!"

"నే నేమన్నా గార్డియన్‌నా? నేనేం కాదన్నావుగా!"

"తంతే, మళ్ళీ తంతాడేమో!"

"పద చూద్దాం."

ఆర్కెస్ట్రాలో కూచున్న భాస్కరరావుని ఇవతలకి పిలిచాడు వెంకుబాబు.

"ఏమిటీ ఈ వ్యవహారం?" అన్నాడు కోపంగా.

"అవును ఏమిటి వ్యవహారం?" అన్నాడు జాలయ్య.

"ఏం వ్యవహారం?"

"ఎవరురా నువ్వు. నాతో చెప్పకండా ఆ రుక్మిణిని తీసుకు పోయినావు?"

"నీకేం బుద్ధిలేదూ?"

"నీకేం నీతి లేదూ?"

"ఆరుగురు పిల్లలూ నువ్వూ?"

"పాపం, ఏ మెరగని అమాయకురాల్ని...."

"దాన్ని దడిపించి, బెదిరించి...." అని గబ గబ అనేశారు వాళ్ళిద్దరూ.

"ఆగండి. ఆగండి మీ కేం సంబంధం రుక్మిణి విషయం?" అన్నాడు భాస్కరరావు.

"నేను రుక్మిణి గార్డియన్"

"నేను రెండో గార్డియన్."

పకపక నవ్వాడు భాస్కరరావు.

"తీసుకుపొండి బాబూ. నా ప్రాణాలు తీసేస్తోంది. ఇద్దరు ఇంత గొప్ప గార్డియన్లు వుండేనా నా మీదికి వొదిలారూ ఆ ముండని! నిన్నరాత్రి వొచ్చి కూచుంది మా ఇంట్లో. కదలదు. రాత్రంతా నా భార్యకీ, దానికీ యుద్ధం నిద్రలేదు. తెల్లార్లూ ఇద్దర్నీ సున్నం కింద తన్నాను. మళ్ళీ నావేపు రాకుండా తీసుకుపోదురూ. ఏమన్నా ఇచ్చుకుంటాను."

ఒకరి మొహాలు ఒకరు చూచుకున్నారు ఇద్దరు యోధులూ.

"ఎందుకు వొచ్చింది మీ ఇంటికి?"

"ఏమో అడగండి. మా అత్తవారి వూరూ, రుక్మిణి వూరూ ఒకటే. నాలుగేళ్ళకిందటే నన్ను వెంబడించింది. పూర్వజన్మలో నేను తన భర్తనిట. కలలో కనపడి ఎవరో చెప్పారుట. దీని బాధ పడలేక అత్త గారింటికి వెళ్ళటం మానుకున్నాను. నే నెక్కడ వున్నానో కనుక్కుంది గావును. ఇక్కడికి పారిపోయి వొచ్చి ఈ సినీమాలో చేరింది. ఆ నాటి నించి నా ప్రాణం కొరుక్కుతింటోంది. ఆ పిల్లని తీసుకుపోయి నన్ను బతికించండి. ఇదెక్కడి గోల?"

అంటో వెళ్ళిపోయాడు.

ఇద్దరు మిత్రులూ స్త్రీ చిత్తాన్ని తిట్టుకుంటో స్టూడియో కేఫ్ దగ్గిరికి పోయినారు పకోడీలు నమలడానికి.

కాని రుక్మిణికల నిజమనీ, బాస్కరరావుని భర్తకింద భావించు కుందనీ, అతనితో స్నేహమే ఆమె జీవిత యత్నమనీ, ఈ లోపల ఎక్కడ వున్నా, ఏం చేసినా ఆ లక్ష్యంతోనేననీ ఎవరు నమ్ముతారు? సాగని పనికై ఆమె పడే పాట్లూ, అబద్ధాలూ, వక్రాలూ చూసి నవ్వి, తిట్టి, తన్నేవారే గాని!

★